క్లుప్తంగా

చెత్తనిలయంగా గోవిందపురం మైనర్!



నరసరావుపేట: పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే గోవిందపురం మైనర్ కాలువకు చెత్త గ్రహణం పట్టింది. వినుకొండరోడ్డును క్రాస్ చేస్తూ ప్రవహించే గోవిందపురం మైనర్ కాలువ బ్రిడ్జి వద్ద ఆ ప్రాంత వాసులు, పట్టణంలోని పలు వ్యాపారులు తమ చెత్తను తీసుకొని అక్కడ పడేస్తున్నారు. కుక్కలు, ఆవులు ఆ చెత్తలోని ఆహార పదార్థాల కోసం వెదుకులాట చేస్తుండడంతో కొంత చెత్త కాలువలోని నీటిలో పడుతుంది. అధికారులు స్పందించి, చెత్తను తొలగించి మరెవరూ అక్కడ చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు వితరణ



వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు కార్యాలయంలో ఆదివారం ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాల బహూకరణ జరిగింది. దాతలు చింతలచెర్వు రాఘవేంద్రరావు, దారి వ్వేములు చంద్రశేఖరశాస్త్రి, ఉల్లగంటి మల్లిఖార్జునరావు, దారా రామమూర్తి, చింతలపూడి తిరుపతమ్మ, చంద్రమౌళి, శ్రీశైల మల్లిఖార్జున శాస్త్రిల సహకారములతో ఈ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఎం.వి.శర్మ, భువనగిరి సుబ్రహ్మణ్యం, పుట్టంరాజు నారాయణరావు, అప్పరాజు నాగేశ్వరావు, రవికుమార్ పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 75 మందికి పరీక్షలు



రొంపిచర్ల: స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సరికొండ హనుమశ్రీ, చంద్రపాటి చలపతిరావులు పాల్గొని వైద్యసేవలు అందించారు. నేత్ర సమస్యలు, మధుమేహం, రక్తపోటు, టీబీ, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అందించగా సరకొండ రామకృష్ణంరాజు శిబిరాన్ని ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్డులో వేంచేసి ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో వివిధ మాలలు ధరించిన స్వాములకు 82 రోజులు సద్ది వితరణ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా ఆలయంలో పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 18 మెట్ల జ్యోతులను వెలిగించారు. సంక్రాంతికి మకర జ్యోతి ప్రజ్వలన ఉంటుందని తెలిపారు. ఆలయ ధర్మకర్త గుడివాడ చిన్నగురునాథం, అర్చకులు ప్రసాద్ శర్మ, జెట్టి తిరుపతిరావు, హనుమంతరావు, డాక్టర్ ఎల్.ఎస్.రావు, అన్నదాన కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

నకరికల్లు: ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామం సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లు నుంచి గుండ్లపల్లికి వెళ్తున్న ఆటోకు ఎదురుగా కోతులు రావడంతో ఆటో ఒక్కసారిగా డ్రైవర్ పక్కకు తిప్పాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ప్రయాణికుడు గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ మౌలాలికి తీవ్రగాయాలు కాగా ఆటో డ్రైవర్ నకరికల్లుకు చెందిన పెద్దినీడి శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

సమస్యలతో తడబడి!

- సమస్యలతో కునారిల్లుతున్న సర్కారీ బడులు
- రేమిడిచర్ల ఉన్నత పాఠశాలలో సమస్యలు వెల్లువ
- విద్యుత్ లైన్‌లతో పొంచి ఉన్న ముప్పు
- వేధిస్తున్న మంచి నీటి సమస్య, ఉపాధ్యాయుల కొరత
- చాలినన్ని తరగతి గదులు లేక ఇబ్బందులు
- ఆటస్థలం సరిలేక మోడల్ స్కూల్ విద్యార్థుల ఇక్కట్లు



రేమిడిచర్ల ఉన్నత పాఠశాలలో చాలినన్ని గదులు లేక బయట తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



రేమిడిచర్లలో పనిచేయని మంచినీటి ట్యాపులు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూలు పలు సమస్యలకు నిలయంగా తయారయ్యాయి. రేమిడిచర్ల ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా గత రెండు సంవత్సరాల క్రితం అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం పాఠశాల 1 నుంచి 9 వరకు 198 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో గతంలో నాడు–నేడు ఫేజ్ -1 కింద పలు విభాగాల్లో మౌలిక వసతుల కల్పన, ఫేజ్–2లో భాగం రెండు గదుల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేపట్టిన రెండు గదులు అసంపూర్తిగా నిలిచాయి. పాఠశాల ఆనుకొని విద్యుత్ లైన్ ఉండటంతో ముప్పు పొంచి ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌లైన్‌లు తొలగించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని తెలిపారు. అదేవిధంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీరు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. వీటితో పాటు ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల కొరత నెలకొందని, నాలుగు గదులు అవసరమని ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠశాలలో 5 పోస్టుల ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందని అంటున్నారు.

క్రీడలకు పనికిరాని ఆటస్థలం..

మండల కేంద్రమైన మోడల్ స్కూల్లో ఆటల పోటీల నిర్వహణకు గ్రౌండ్ సక్రమంగా లేకపోవడంతో క్రీడలకు అనుకూలంగా లేదని విద్యార్థులు వాపోతున్నారు. మోడల్ స్కూల్లో 6 నుంచి ఇంటర్ వరకు 550మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. స్కూల్‌కు ప్రత్యేకంగా పీడీ ఉన్నారు. పాఠశాలలో ఖాళీ స్థలం ఉన్నప్పటికీ క్రీడలకు అనుకూలంగాలేదని, ప్రస్తుతం వాలీబాల్, ఖోఖో పోటీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. గతంలో అథ్లెటిక్స్, హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్, డిస్కస్‌త్రో షాట్‌పుట్ వంటి క్రీడలు ఆడించేవారు. హైజంప్, డిస్కస్‌త్రోలో రాష్ట్రస్థాయిలో విద్యార్థులు రాణించిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడ నాడు – నేడు కింద గ్రావెల్ తోలించారు గానీ, గ్రావెల్ నాశిరకంగా రాళ్లు తేలిఉండడం, దాన్ని సక్రమంగా చదునుచేయకపోవడంతోనే సమస్య ఏర్పడింది. ప్రస్తుతం గ్రౌండ్ సక్రమంగా లేక క్రీడలు నిలిచిపోయాయి.



క్రీడలకు అనుకూలంగా లేని మోడల్ స్కూల్‌లోని ఆట స్థలం

బయట నుంచి మంచినీరు తెప్పిస్తున్నాం..

పాఠశాల ఆనుకొని విద్యుత్ లైన్ వెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. దీంతో పాటు గదుల కొరత ఉంది. నాడు–నేడులో భాగంగా పాఠశాల ఆవరణలో భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో పరిశీలన చేస్తే పాఠశాల ఆవరణలో భూగర్భంలో నీరు లేవని తేలింది. ప్రస్తుతం విద్యార్థుల కోసం బయట నుంచి నీరు తెప్పిస్తున్నాం. తెలుగు, హిందీ, పీఎస్, ఎస్ఎస్ ఉపాధ్యాయుల కొరత త్వరలో భర్తీ కావచ్చు.

– విన్సెంట్ ఫిలోమాన్, హెచ్ఎం, రేమిడిచర్ల ఉన్నతపాఠశాల

గ్రౌండ్ మరమ్మతులు చేశాం..

మోడల్ స్కూల్లో క్రీడాపోటీలకు అనుగుణంగా నాడు–నేడులో ఫేజ్ -1లో ఆట స్థలాల్లో మట్టిని తోలించాం. ఆటలు ఆడుకునేందుకు అనుకూలంగా మరమ్మతులు చేశాం.

–వి.పద్మావతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

అలరించిన సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహణ

నరసరావుపేట ఈస్ట్: సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కళావేదిక ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శనివారం, ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, సుధారాజేశ్వరి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్కృతిని కాపాడుకున్నప్పుడే జాతి మనుగడ సాధ్యపడుతుందని తెలిపారు. సంబరాలలో భాగంగా నాగపూర్‌కు చెందిన శ్రీసాయి నటరాజ కూచిపూడి అకాడమి నాట్యాచార్యులు ఎ.పి.నివేదిత బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన, స్థానిక కళాకారులు ప్రదర్శించిన పడక సీను పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకున్నాయి. కాగా ఆదివారం రాత్రి గుంటూరు దాక్షిణ్య సంస్థ దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంద్రజాలికుడు బి.ఎస్.రెడ్డి ఇంద్రజాల ప్రదర్శన ఆహూతులను అలరించాయి. ఆయా కార్యక్రమాలలో 13వ అదనపు జిల్లా జడ్జి ఎస్.సత్యశ్రీ, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అధ్యక్షుడు శ్రీగిరిరాజు అయ్యపరాజు, కార్యదర్శి మురారిశెట్టి గోపాలబాబు, స్వర్ణ చినరామిరెడ్డి, అనంతలక్ష్మి, డాక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాలలో కూచిపూడి నృత్య ప్రదర్శన

రోడ్డు ప్రమాదాల నివారణకు 'ఫేస్ వాష్ అండ్ గో'

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట: జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రధాన కూడళ్లలో శనివారం రాత్రి నుంచి పోలీసులు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రోడ్లపై వెళుతున్న లారీలు, ప్రైవేటు బస్సులు, కార్లును ఆపి డ్రైవర్లకు నీటితో ముఖం శుభ్రం చేయిస్తున్నారు. దీని వలన నిద్ర మంపు తగ్గి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని భావిస్తున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చేటువంటి ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



లారీ డ్రైవర్‌చే నీటితో ముఖం కడిగిస్తున్న పోలీసులు

వైభవంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో పూజలు అనంతరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి పట్టణ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం ముందు మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గ్రామోత్సవంలో రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాలస్వామి

నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కంచేటి శేషగిరిరావు (75) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. హుటాహుటిన వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు కంచేటి నాగరాజు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేసి, స్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేసి, ప్రస్తుతం ఈపూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయుచున్న నర్రెడ్డి రామకృష్ణారెడ్డికి సన్మాన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అదే విధంగా రామకృష్ణారెడ్డి తో పాటు స్కూల్ లో పనిచేసిన ఉపాధ్యాయులకు కూడా సన్మానం చేయడం జరుగుతుందన్నారు. స్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయవలసిన కార్యక్రమాలపై చర్చించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు కాల్చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్



నరసరావుపేట: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం అధిక భారం మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా భోగి మంటలలో విద్యుత్ బిల్లులు దహనం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఒక వైపు సర్దుబాటు చార్జీల పేరిట భారాలు మోపుతూ మరో వైపు స్మార్ట్ మీటర్లు బిగించి మరింత ముంచేలా కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వెంటనే ఈ భారాన్ని ప్రభుత్వం భరించాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలన్నారు.

కోడి పందేలు వేస్తున్న ఐదుగురి అరెస్ట్

బెల్లంకొండ: కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. చంద్రాజుపాలెంలో ఆదివారం ఉదయం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురుని అదుపులోకి తీసుకుని, కోడి పుంజులు, రూ.1,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, మల్లికార్జునరావు, ఎల్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

స్తంభాన్ని తొలగించరూ.. !



నరసరావుపేట: రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగించే రోడ్డు అది. రోజూ పదుల సంఖ్యలో ఆటోలు ప్రయాణికులతో అక్కడినుంచి ఇక్కడకు, ఇక్కడి నుంచి అక్కడకు చక్కర్లు కొడుతుంటాయి. ఆ మార్గంలో ప్రకాష్‌నగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో సతీష్ రోడ్డు కూడలి వద్ద ఓ ప్రైవేటు సంస్థ ఫైబర్‌నెట్ వైర్లు కోసం ఏర్పాటుచేసిన స్తంభాన్ని పెకిలించి రోడ్డుమార్జిన్‌లో పడేశారు. వెంటనే దానిని తొలగించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. మున్సిపల్ అధికారులు కలుగచేసుకొని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పిండి వంటలు పంపిణీ

సత్తెనపల్లి: సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ వద్ద గంజి రాములు, అంజమ్మ జ్ఞాపకార్థం కుమారుడు గంజి వీరాస్వామి ఆదివారం 100 కుటుంబాలకు పిండి వంటలు పంపిణీ చేశారు. సీఐ అవ్వారు వెంకటబ్రహ్మం ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ప్రముఖ న్యాయవాది బగ్గి నరసింహారావు, గంజి వీరాస్వామి, పణిదం చేనేత సొసైటీ అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, బండి పూర్ణచంద్ర, కాకుమాను జోసెఫ్ కుమార్, వంగర శ్రీనివాసరావు, మార్నేళ్ల వీరాంజనేయులు ఉన్నారు.



ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మానవ సేవా సమితి కార్యనిర్వాహణ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.సురేష్‌బాబు వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని, క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. నాగార్జున, రాంబాబు, చందు, సాదిక్, బాజీ, బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పి.వి.సురేష్, యువత

వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ..

నరసరావుపేట ఈస్ట్: వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వద్ద నున్న వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కో–ఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ రామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ గుంటూరు విభాగ్ సహ బౌద్ధిక్ ప్రముఖ్ పెద్దిరెడ్డి రామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ రెడ్డి జాలయ్య, బీజేపీ నాయకుడు జన్నాభట్ల ఆదిత్య, సేవాసమితి ప్రతినిధులు కొత్త సీతారామాంజనేయులు, అంగర శివకుమార్, ఎ.బుద్ధప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకోవాలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవర్చుకోవాలని మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ తెలిపారు. కేసానుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. 978మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జిల్లాకు తలమానికమవుతుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సంగీతం, యోగ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడం వలన శారీరక, మానసిక ఉల్లాసం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ సిహెచ్ రామరాజు మాట్లడుతూ పరీక్షా ఫలితాలను, సర్టిఫికెట్లను విద్యార్థులకు ఈనెల 20వ తేదీ లోపు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ నాగోతు ప్రకాష్, ఏవో రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్

కోడి పందేలు వేస్తే జైలుకే..

రొంపిచర్ల: మండలంలో ఎలాంటి జూదం, కోడిపందేలకు తావు లేకుండా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో ఆటో మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. గతంలో జూదం, కోడిపందేలు ఆడే చరిత్ర ఉన్నవారిని గుర్తించి హెచ్చరికలు చేశారు. ప్రతి గ్రామాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించారు. పేకాట, కోడి పందేల స్థావరాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. అందులో భాగంగా కొనకంచివారిపాలెం గ్రామంలో కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకున్న బరిని ఆదివారం ట్రాక్టర్‌లతో దున్నించి ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ అశోక్ అక్కడికి చేరుకొని పరిశీలించారు. భూ యజమానులను కూడా హెచ్చరించారు. జూదాలు, కోడి పందేలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

సాతులూరులో బరులు ధ్వంసం

నాదెండ్ల: సాతులూరు గ్రామ పరిధిలోని బుక్కాపురం రోడ్డులోని జగనన్న కాలనీలో టీడీపీ నాయకులు కోడి పందేల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎర్రమట్టితోలి గ్రౌండ్‌లో సిమెంట్ పోల్స్ వేశారు. సమాచారం తెలుసుకున్న నాదెండ్ల ఎస్ఐ జి.పుల్లారావు సంఘటనా స్థలానికి వెళ్లి పోల్స్ తొలగించారు. కోడి పందేల నిర్వహణ చట్టవిరుద్ధమని, పందెలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కొనకంచివారిపాలెంలో బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు



కోలాహలంగా శ్రీవారి గ్రామోత్సవం



కోలాట ప్రదర్శనలో మహిళలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. తిరుపతి తరహాలో రైల్వేస్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శ్రీవారికి ముత్యాల పందిరి వాహనంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందారు. వివిధ రూపాల్లో కళాకారుల వేషధారణలు, మక్కపాటి బ్రహ్మం నేతృత్వంలో మహిళల కోలాట ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నాయి. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



రంగవల్లి తీర్చిదిద్దుతున్న చిన్నారి

అచ్చంపేట: చామర్రు వెంకటరాజా ట్రస్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ఆదివారం వేకువజామున ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. భోగి మంటలు వేసి, రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు పెట్టి చేయి చేయి పట్టుకుని ఆటపాటలతో భోగి మంట చుట్టూ నృత్యాలు చేశారు. చిన్నారి హరిదాసు, గింగిరెద్దు ఆడించే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు ఈ సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని విద్యార్థులను అభినందించారు.



హరిదాసుతో వేషధారణలో..